క్లుప్తంగా

3న వళ బళ్లారికి పాదయాత్ర

ఆదోనిఅర్బన్: ఆదోని నుంచి వళ బళ్లారికి ఈనెల 3, 4వ తేదీల్లో పాదయాత్ర చేపడుతున్నామని శ్రీశివయోగి శ్రీవళ బళ్లారి చెన్నబసవేశ్వరస్వామి భక్త బృందం సభ్యుడు మహర్షి విజయ్‌కుమార్ తెలిపారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పాదయాత్రగా శివయోగి చెన్నబసవేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని పూజలు చేసిన అనంతరం భక్తులతో సమావేశం ఉంటుందని తెలిపారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్షలు


పరీక్షలు రాస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్‌సీసీ గ్రూపు నుంచి జేసీఓ విజయ్ కుమార్, హవల్దార్లు గురుప్రీత్, అచ్చన్న, రావు, ఏఎన్‌ఓ పరిమళ, సుధాకర్, రమేష్ నాయుడు, అనిల్, నాగరత్న పరీక్షలను నిర్వహించారు. 28 ఆంధ్ర, 1 మెడికల్, 9 ఆంధ్ర బాలికల బెటాలియన్స్‌కు సంబంధించి 200 మంది పరీక్షలను రాసినట్లు వారు తెలిపారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు డ్రిల్ నిర్వహించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులతో పాటు ఉద్యోగాలకు ఉపయోగపడుతాయని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ వంటి పొదుపు ఖాతాల రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. 2023 పీఆర్సీ పెండింగ్ బకాయిలను మంజూరు చేయాలన్నారు. పెండింగ్ బకాయిలు సకాలంలో రాకపోవడంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కాశీవిశ్వనాథ శాస్త్రి, నాగ ప్రసాద్, శ్రీనివాసులు, జ్యోతి మూర్తి, హనుమన్న, శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పూజల్లో భాగంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్‌మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే గాకుండా కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

ఘనంగా కాశీంస్వామి ఉరుసు


పెండేకల్లులో కాశీంస్వామి షంషేర్ ఊరేగింపు

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లులో కాశీంస్వామి ఉరుసు ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున పూలతో అలంకరించిన స్వామి షంషేర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు, దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

నాడు అవస్థలు

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు ఉండేవి కావు. మరుగుదొడ్లు ఉంటే నీటి సమస్య... నీళ్లు ఉంటే తలుపులు ఉండవు. ఒకవేళ అన్ని ఉన్నా నిర్వహణ లేక వెళ్లలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో చెట్ల పొదలు, గోడల చాటే గతి. అక్కడక్కడ అరకొర అయాలను నియమించినా ఏడాదికోసారి వేతనాలు ఇచ్చేవారు. శుభ్రతకు అవసరమైన సామగ్రి కూడా పంపిణీ చేసేవారు కాదు. దీంతో పెద్దగా ఫలితం రాలేదు.

నేడు సౌకర్యాలు

పేద విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులతో నేడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలను తలపిస్తున్నాయి. పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులు, టాయిలెట్లను నిత్యం శుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలలకు అయాలను నియమించారు. ఒక్కో అయాకు నెలకు రూ. 6 వేలు గౌరవ వేతనం ఇస్తున్నారు.

సౌకర్యాలు మెరుగు‘బడి’

- ప్రభుత్వ బడుల్లో పక్కాగా టాయిలెట్ల నిర్వహణ
- క్రమం తప్పకుండా క్లీనింగ్ సామగ్రి సరఫరా
- ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్న ఆయాలు
- తొలగిన మరుగు కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ బడుల్లో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. విద్యా ప్రమాణాలతో పాటు పాఠశాలల శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఫలితంగా విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలల్లో మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వసతుల కల్పనలో భాగంగా టాయిలెట్ల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో మొత్తం 54,509 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడానికి 300 మంది విద్యార్థులకు ఒకరు, 301 నుంచి 600 మంది విద్యార్థులుంటే ఇద్దరు, 601 నుంచి 900 మంది విద్యార్థులుంటే ముగ్గురు, 900 మంది విద్యార్థులకు పైగా ఉంటే నలుగురు అయాలను నియమించారు. వీరికి నెలక రూ.6,000 గౌరవ వేతనం అందజేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలోపు టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలల్లో అవసరమైన బాత్‌రూమ్ బకెట్లు, జగ్గులు, చెత్త సేకరణకు అనువైన బకెట్లు, క్లీనింగ్ బాటిళ్లు, బ్రెస్‌లు, ఆయాలకు సేఫ్టీ జాకెట్లు, గౌస్‌లు అందించారు. మరుగుదొడ్లను నిత్యం శుభ్రంగా ఉంచేందుకు బాత్‌రూమ్ క్లీనర్ ద్రావణం, ఎయిర్ ప్రెష్నర్ ద్రావణాన్ని ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసింది. పాఠశాలలను నిత్యం పరిశుభ్రంగా ఉంచడంతో బడులు ఎంతో అహ్లాదంగా కనిపిస్తున్నాయి.


మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న ఆయా

ఆదోని నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

పాఠశాలలు	- 108
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు	- 2
గురుకుల బడులు	-2
మొత్తం విద్యార్థులు	- 54,509


ప్రభుత్వం సరఫరా చేసిన క్లీనింగ్ సామగ్రి

నిత్యం పర్యవేక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో బాత్‌రూమ్, టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం పర్యవేక్షిస్తున్నాం. వాటి నిర్వహణకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. అయాలకు అవసరమైన అన్ని వస్తువులను అందించారు. పాఠశాలల పరిసరాలతో పాటు అన్నింటిని శుభ్రంగా ఉంచుతున్నారు. దీంతో నేడు పాఠశాలలు ఎంతో అహ్లాదంగా కనిపిస్తున్నాయి. పిల్లలు మంచి వాతావరణంలో చదువుకుంటున్నారు.

–బి. శివరాములు, ఎంఈఓ, ఆదోని

బాత్‌రూమ్‌లు బాగున్నాయి



గతంలో బాత్‌రూమ్‌లు ఉన్నా సరిగ్గా ఉండేవి కావు. దీంతో వాష్‌రూమ్‌కు వెళ్లాలి అంటే ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. బాత్‌రూమ్‌లు చాలా బాగున్నాయి. అయాలు కూడా ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని శుభ్రంగా ఉంచుతున్నారు.

–రేణుక, విద్యార్థిని, పురపాలక ఉన్నత పాఠశాల, ఆదోని

మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుతున్నాం



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నాడు–నేడు పనులను చేపట్టింది. భవనానికి కొత్త రూపు తీసుకొచ్చింది. పాఠశాలల్లో తాగు నీరు, బాత్‌రూమ్, టాయిలెట్లు వంటి సౌకర్యాలను కల్పించింది. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతున్నాం. పాఠశాలల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందిస్తున్నాం. ఆయాలకు అవసరమైన వస్తువులను కూడా ప్రభుత్వం సరఫరా చేసింది.

–కె.మల్లికార్జున, హెచ్‌ఎం, పురపాలక ఉన్నత పాఠశాల, ఆదోని

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని నగరూరు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఆదినగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పత్తికొండ ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహించేందుకు ఆదోని నుంచి బైక్‌పై వెళుతున్నారు. ఆదోని మండలం నగరూరు వద్ద బైకు అదుపు తప్పి కింద పడింది. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. గతంలో ఈయన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇటీవలే బదిలీపై పత్తికొండకు వెళ్లారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి అవమానం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు పేడ పూశారు. చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర, పట్టణ నాయకులు విట్టా రమేష్, బద్రి, కాకుబాళ్ నగేష్, మనోహర్‌శెట్టి మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరుడైన గొప్ప నాయకుడు పొట్టి శ్రీరాములు అని చెప్పారు. అలాంటి గొప్ప నాయకుడి విగ్రహానికి పేడ పూయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ విషయంపై టూటౌన్ సీఐ గోపీచంద్‌ను వివరణ కోరగా, సీసీ కెమెరాలను పరిశీలించామని, ఆ వ్యక్తి పిచ్చోడని తెలిసిందన్నారు. మరొకసారి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అట్టహాసంగా వృషభాల బండలాగుడు పోటీలు


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతుల కష్టాలు తీర్చేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఆదివారం ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన (బండలాగుడు పోటీలు)ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, రైతు సంఘ నాయకుడు భీమిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం అమలుచేసిన పథకాలను వివరించారు. ఉత్సవాల్లో భాగంగా రైతులు, పశుపోషకుల కోసం ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, నాయకులు రియాజ్‌అహమ్మద్, మాచాని వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మన్సూర్, పిల్లిగుండ్ల గోవిందు, కుమారస్వామి, పేట శ్రీనివాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కోటకొండ నరసింహులు, కేశవ రెడ్డి, బజారి తదితరులు పాల్గొన్నారు.

విజేత కొండయ్యపాలెం వృషభాలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో మొదటి రోజు జరిగిన రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలో గుంటూరు జిల్లా కొండయ్యపాలెంకు చెందిన జీపి.చౌదరి వృషభాలు విజేతగా నిలిచాయి. వృషభాల యజమానికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మొదటి బహుమతి రూ.40 వేలు అందజేశారు. రెండవ స్థానంలో తొటపాలెంకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి, ముదిరాళ్ల ముప్పాలకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి వృషభాలు, మూడవ స్థానంలో పంచలింగాలకు చెందిన బైరపోగు వృషభాలు, నాలుగవ స్థానంలో కలుగొట్ల గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు వృషభాలు, ఐదవ స్థానంలో రుద్రవరంకు చెందిన గోపాల్‌గౌడ్ వృషభాలు నిలవగా ఆ యజమానులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఆర్గనైజర్లు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, కన్వీనర్ గాజుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై సమీక్ష


బాపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను వందశాతం పూర్తి చేయాలని ఆదోని డీఎల్‌డీఏ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఉరుకుంద, ఎరిగేరి, కామవరం, హాల్వి గ్రామాల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బరాజుతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామాల్లో సర్వే నత్తనడకన సాగుతోందని.. వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో వందశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. పంచాయతీ ఏఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ప్రతి క్లస్టర్‌లో కులగణన సర్వే

కులగణన సర్వేను ప్రతి క్లస్టర్‌లో పూర్తి చేస్తామని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. ఆదివారం బాపురం, రౌడూరు, కౌతాళంలో సర్వేను పరిశీలించారు. మండలంలోని 23 సచివాలయాల్లో సర్వే చివరి దశలో ఉందన్నారు. మండలంలో 377 క్లస్టర్లు ఉన్నాయని.. ఆదివారం వరకు 85 శాతం పూర్తి అయ్యిందన్నారు. మండలంలో మొత్తం 26,519 ఇండ్లు ఉన్నాయని, ఇందులో 88440 మంది ఉన్నారని తెలిపారు. వలంటీర్లు, బీఎల్‌ఓలు, వీఆర్‌ఓ, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి ఆయా కులాలపై సర్వేను చేపట్టినట్లు తెలిపారు. మండలంలో కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, వలంటీర్లు పాల్గొన్నారు.


సర్వేపై చర్చిస్తున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

నేడు సొసైటీ భవనం ప్రారంభం

హొళగుంద: మండల సమీపంలోని శ్రీరాంనగర్ క్యాంప్‌లో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన కార్యాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉండడంతో నాబార్డ్, ఆప్కాబ్, డీసీసీబీ రుణాలతో ఆఫీస్ రూం, గోడౌన్, బ్యాంక్ లాకర్ గది ఇలా అనేక సదుపాయలతో నిర్మాణం పూర్తి చేసినట్లు సింగిల్ విండో చైర్మన్ మేలగిరి మల్లికార్జున తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, ఇతర ప్రముఖులు హాజరవుతారని, మండలానికి చెందిన జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అలరించిన నాటక ప్రదర్శన


గయోపాఖ్యానం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలో రెండు రోజులుగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎర్రకోట జగన్ యూత్ నాయకులు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ‘రేలారే రేలా–దుమ్ము లేపు’ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నీలకంఠేశ్వర స్వామి నాటక కళా సమితి ఆధ్వర్యంలో మయసభ కురుక్షేత్రం పడకసీను, శ్రీకృష్ణ, భవాని సీను, అష్టమాంకాములు తదితర పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు, అర్జునుడి పాత్రల్లో విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన నందిఅవార్డు గ్రహీతలు శ్రీనివాసరెడ్డి, రత్నశ్రీ, కిలారి లక్ష్మి, వి.రాముడు తదితరులు ఆకట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు కొనసాగిన నాటక ప్రదర్శనలను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి తిలకించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. మాజీ ఎంపీ బుట్టారేణుక, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు రిటైర్డ్ ఎంఈఓ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు జాతరలో రూ.2.50 లక్షలకు విక్రయానికి ఉంచిన వృషభాలు


విక్రయానికి ఉంచిన కొడవళ్లు, గొడ్డళ్లు

జోరుగా అమ్మకాలు


అమ్మకాలకు ఉంచిన కాడిమాన్లు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణంలో అత్యంత వైభవంగా ప్రారంభమైన నీలకంఠేశ్వర స్వామి జాతరలో భాగంగా రైతన్నలకు వ్యవసాయానికి అవసరమైన సామగ్రిని విక్రయించేందుకు వ్యాపారులు పెద్దఎత్తున తీసుకొచ్చారు. మంత్రాలయం రహదారి సమీపంలో ఎద్లను భారీ సంఖ్యలో విక్రయానికి ఉంచారు. జత ఎద్లు రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు ఉండగా వాటిని పరిశీలించి కొనుగోలు చేసేందుకు పలు ప్రాంతాల నుంచి రైతులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అదేవిధంగా ఎద్దులకు వేసే ముకుతాళ్లు, మెడలో వేసే గంటలు, పనగజ్జలు, మూగలు, కుచ్చులు, కొమ్ములకు అలంకరించే వస్తువులు, పగ్గాలు, గొండెలు తదితర అలంకరణ సామగ్రి అమ్మకానికి రావడంతో రైతులు ఉత్సాహంగా కొనుగోలు చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో టైర్లతో కూడిన ఇనుప ఎద్ల బండ్లను అమ్మకానికి ఉంచారు. ఎద్ల బండ్లు రూ.42 వేల నుంచి ఆపైనే ధర పలుకుతుండగా వ్యవసాయంలో ఉపయోగించే విత్తన, ఎరువులు వేసే ఇనుప గొర్రులు, నాగళ్లు తదితర వ్యవసాయ సామగ్రిని సైతం వ్యాపారులు విక్రయానికి ఉంచారు. వ్యవసాయానికి అవసరమైన వస్తువులన్నీ అందుబాటులో ఉండడంతో రైతన్నలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు.


వృషభాలకు వేసే ముకుతాళ్లు, చెర్నకోళ్లు, తదితర వస్తువులు


విక్రయానికి వచ్చిన ఎద్ల బండ్లు


విత్తనం వేసే గొర్రులు, నాగళ్లు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని బాపురం, రౌడూరు గ్రామాల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీఎం ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్, పీఎం పోషణ అభియాన్, దీనదయాల్ అంత్యోదయ యోజన, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం విశ్వకర్మ యోజన, అవాజ్ యోజన, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు, జన్‌ధన్‌యోజన, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్, కిసాన్ క్రెడిట్ కార్డులు తదితర పథకాలను వివరించారు. సర్పంచ్ సుశీల, బాపురం ఉప సర్పంచ్ రామాంజి పాల్గొన్నారు.